తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com

# జయభేరి

03-06-2024
సోమవారం
మల్కాజిగిరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

jayabherinews

సంపుటి : 01 | సంచిక : 283 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..

ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం

అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత

jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889




2 లో

# ఘనంగా తెలంగాణ అవతరణ వేడుకలు

## అధికారికంగా రాష్ట్ర గీతం విడుదల, పాట ఇదే

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గన్‌పార్క్ అమరవీరుల స్థూపం దగ్గర సీఎం రేవంత్ నివాళులర్పించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోతెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గన్ పార్క్ అమరవీరుల స్థూపం దగ్గర నివాళులు అర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తర్వాత... తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించారు.



## 31/32- సిక్కింలో దుమ్మురేపిన ఎస్‌కేఎం..

- అక్కడ బీజేపీ 0

సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎస్‌కేఎం ప్రభంజనం. 32 సీట్లల్లో 31 స్థానాల్లో గెలిచి భారీ విజయాన్ని అందుకుంది. ఇక్కడ బీజేపీ ఖాతా తెరవలేదు. 2024 సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో సిక్కిం క్రాంతికారి మోర్చా పార్టీకి భారీ విజయం దక్కింది. ఆదివారం ఓట్ల లెక్కింపు పూర్తవ్వగా.. మొత్తం 32 సీట్లున్న అసెంబ్లీల్లో ఇప్పుడు ఎస్‌కేఎంకు చెందిన 31 మంది ఎమ్మెల్యేలు ఉండనున్నారు. 2024 సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో సిక్కిం క్రాంతికారి మోర్చా పార్టీకి భారీ విజయం దక్కింది. ఆదివారం ఓట్ల లెక్కింపు పూర్తవ్వగా.. మొత్తం 32 సీట్లున్న అసెంబ్లీల్లో ఇప్పుడు ఎస్‌కేఎంకు చెందిన 31 మంది ఎమ్మెల్యేలు ఉండనున్నారు. ఎస్‌కేఎం జోరు ముందు విపక్షాలు తుడుచుపెట్టుకుపోయాయి. చాలా మంది

...మిగతాది 2 లో



## గుడ్ న్యూస్ చెప్పిన సజ్జనార్

- టీజీఎస్‌ఆర్టీసీలో 3 వేల ఉద్యోగాలు భర్తీ

తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర చిరస్మరణీయమని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా 2000 కొత్త డీజిల్, 990 ఎలక్ట్రిక్ బస్సులను దశల వారీగా వాడకంలోకి తీసుకువస్తామన్నారు. ఇందుకు అనుగుణంగా 3 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర చిరస్మరణీయమని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. 'బస్ కా పయ్యా నహీ ఛలేగా' నినాదంతో చేపట్టిన సమ్మె తెలంగాణ ఉద్యమానికి

...మిగతాది 2 లో



## రియాల్టర్ ఇంట్లో మహిళా దారుణ హత్య


- మేడ్చల్ జిల్లాలో దారుణ హత్య జరిగింది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో గుర్తుతెలియని మహిళను కాళ్లు, చేతులు కట్టే ముఖానికి ప్లాస్టిక్ కవర్ చుట్టి, ఛార్జింగ్ వైర్ తో గొంతు బిగించి హత్య చేశారు.

**జయభేరి, మేడిపల్లి :**

ఓ మహిళ దారుణంగా హత్యకు గురైన ఘటన మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ మల్లిఖార్జున నగర్ లో ఓ ఇంట్లో సత్యనారాయణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి గత కొన్నేళ్లుగా కిరాయి ఉంటూ అప్పుడప్పుడు మాత్రమే వచ్చి పోతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలోనే శనివారం సత్యనారాయణ కిరాయి ఉండే ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వాళ్లు వెళ్లి చూడగా.... మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా... మహిళను దారుణంగా కాళ్లు, చేతులు కట్టేసి ముఖానికి ప్లాస్టిక్ కవర్ చుట్టి, ఛార్జింగ్ వైర్ తో గొంతు బిగించినట్టు పోలీసులు గుర్తించారు. మహిళ మృతదేహం కొంత భాగం కుల్లిపోయినట్టు గుర్తించారు. చుట్టు పక్కల లభించిన ఆధారాలను పోలీసులు సేకరించారు. అయితే హత్యకు గురైన మహిళ వయసు సుమారు 50 సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇక ఆ మహిళ ఎవరు? అక్కడికి ఎందుకు వచ్చారు? రియల్ ఎస్టేట్ వ్యాపారి సత్యనారాయణకు ఆ మహిళకు ఉన్న సంబంధం ఏంటి? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. అన్ని కోణాల్లో విచారించిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని మేడిపల్లి సీఐ గోవింద రెడ్డి వెల్లడించారు.

## తీహార్ జైలులో లొంగిపోయిన కేజ్రీవాల్

**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 2:**



దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం తీహార్ జైలులో లొంగిపోయారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో ఆయన కోర్టు ఆదేశాల ప్రకారం జైలుకు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తన ఇంటి నుంచి బయల్దేరిన ఆయన రాజ్‌ఘాట్‌లోని మహాత్మా గాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. అక్కడ నుంచి హనుమాన్ ఆలయానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్న తర్వాత పార్టీ ఆఫీస్‌కు చేరుకున్నారు. పార్టీ నాయకులతో మాట్లాడిన కేజ్రీవాల్ సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ''మధ్యంతర బెయిల్‌పై బయటికి రావడంతో ఎన్నికల ప్రచారంలో నా ప్రయత్నాలు ఫలించాయి.
21 రోజుల్లో ఒక్క నిమిషం కూడా వృథా చేయలేదు. కూటమి తరఫున ప్రచారం చేశా. దేశ ప్రయోజనాలకే నా మొదటి ప్రాధాన్యత. ఆ తర్వాతే ఆమ్ ఆద్మీ పార్టీ'' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని (మోదీ సర్కార్‌ను ఉద్దేశిస్తూ) కేజ్రీవాల్ ఆరోపించారు. ఇదిలా ఉండగా.. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన దిల్లీ ముఖ్యమంత్రి లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌పై మే 10న జైలు నుంచి విడుదలయ్యారు. కోర్టు ఆయనకు 21 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ జూన్ 2న తిరిగి లొంగిపోవాలని ఆదేశించిన విషయం తెలిసిందే.



## రేవంత్‌పై పరోక్ష విమర్శలు..

- మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ హాజరయ్యారు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దిశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో

...మిగతాది 2 లో

## నేడు రౌస్ అవెన్యూ కోర్టుకు కవిత

- కస్టడీ పొడిగించాలని కోరనున్న దర్యాప్తు సంస్థలు

**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 2:**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నారు. జ్యుడీషియల్ కస్టడీ ముగియనుండడంతో ఆమెను కోర్టు ఎదుట హాజరు పరచనున్నారు. కవితతోపాటు చరణ్‌ప్రీత్, దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్‌లను నిందితులుగా పేర్కొంటూ రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను గత నెల 29న న్యాయమూర్తి

...మిగతాది 2 లో





## ఇక బాదుడే.. బాదుడు...

- విజయవాడ-హైదరాబాద్ మార్గంలో ఛార్జీల మోత

ఓఆర్ఆర్ టోల్ ఛార్జీలు పెంచుతున్నట్లు నిర్వహణ సంస్థ ప్రకటించింది. టోల్ నిబంధనల మేరకు నేటి అర్ధరాత్రి పెంచిన ఛార్జీలు అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. దీంతో మళ్లీ బాదుడు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## గుడ్ న్యూస్ చెప్పిన సజ్జనార్

ఊపిరిలూదిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే సంస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ లోని బస్ భవన్ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమర వీరులకు ఆయన నివాళులు అర్పించారు. అనంతరం టీజీఎస్ఆర్టీసీ భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

**ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాత్ర చిరస్మరణీయం**

ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.......తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో ఎంతో మంది అమరులయ్యారని, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ కుటుంబం తరపున అమరులకు ఘన నివాళులర్పిస్తున్నామని అయన అన్నారు. "ఆర్టీసీ ఉద్యోగులు 2011లో 29 రోజులపాటు " మేము సైతం " అంటూ సకల జనుల సమ్మెను కొనసాగించారని గుర్తుచేశారు. దేశ చరిత్రలో జరిగిన అతి పెద్ద సమ్మెల్లో సకల జనుల సమ్మె ఒకటిగా నిలిచిందన్నారు. ఈ సమ్మెలో పెద్ద ఎత్తున 56,604 మంది ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొని స్వరాష్ట్ర సాధనకు నిర్విరామంగా కృషి చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర చరిత్రలో నిలిచిపోయింది అని సజ్జనార్ అన్నారు. మహాలక్ష్మి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన 48 గంటల్లోనే అమలు చేశామని, ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యమ స్ఫూర్తితో పని చేస్తుండటం వల్లే మహాలక్ష్మి విజయవంతంగా అమలవుతోందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ప్రతి రోజు సగటున 45 లక్షల మంది ప్రయాణిస్తే...... ప్రస్తుతం 55 లక్షల మంది టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు.

**త్వరలోనే 3 వేల ఉద్యోగాలు భర్తీ**

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు 7 ఏళ్లకు పైగా పెండింగ్ లో ఉన్న 2017 వేతన సవరణను చేసి......ఉద్యోగులకు 21 శాతం ఫిట్మెంట్ ను సంస్థ ప్రకటించిందన్నారు. పెండింగ్ లో ఉన్న 9 డీఏలను మంజూరు చేశామని చెప్పారు.గత రెండేళ్లలో 1500 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా మరో 2000 కొత్త డీజిల్, 990 ఎలక్ట్రిక్ బస్సులను దశల వారీగా వాడకంలోకి తీసుకురావాలని యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. డీజిల్, ఎలక్ట్రిక్ బస్సులను కలుపుకుని మొత్తంగా 2990 కొత్త బస్సులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. కొత్త బస్సులకు అనుగుణంగా 3 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ అనుమతితో వాటిని వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని వెల్లడించారు.

## ఇక బాదుడే బాదుడు

మొదలైంది. ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని టోల్ ఛార్జీల పెంపు వాయిదా వేసిన కేంద్రం... జూన్ 3 నుంచి ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ ఛార్జీలు పెరిగాయి. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓఆర్ఆర్ టోల్ ఛార్జీలు పెంచుతున్నట్లు...నిర్వహణ సంస్థ ఐఆర్బీ ప్రకటించింది. గ్రేటర్ పరిధిలో 2 లేన్ల సర్వీస్ రోడ్లతో 158 కి.మీ పొడవు, 8 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్ర్ ప్రెస్ వే తో కలిసి ఓఆర్ఆర్ ఉంది. ఓఆర్ఆర్ పై ఐఆర్బీ గోల్కొండ ఎక్స్ ప్రెస్ వే సంస్థ గత ఏడాది నుంచి టోల్ రుసుములు వసూలు చేస్తుంది. జూన్ 3 నుంచి ఓఆర్ఆర్ పై టోల్ రుసుములు 202425 టోల్ నిబంధనల ప్రకారం పెంచుతున్నట్లు నిర్వహణ సంస్థ ప్రకటించింది. ఏటా ఏప్రిల్ 1న టోల్ రుసుములు మార్పులు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా టోల్ పెంపు వాయిదా పడింది.

ఓఆర్ఆర్ పై టోల్ వివరాలు ప్రతి కి.మీకి రేటు(రూపాయల్లో)

కారు/జీపు/వ్యాను/ఎల్ఎమ్వీ/ఎస్యూవీ/ఎమ్పీవీ రూ.2.34

ఎల్సీవీ/మిని బస్ రూ.3.77

బస్/2 యాగ్జిల్ ట్రక్ రూ.6.69

3 యాగ్జిల్ వాణిజ్య వాహనం రూ.8.63

భారీ నిర్మాణ మెషినరీ/ఎర్త్ మూవింగ్ ఎక్విప్మెంట్/4,5,6 యాగ్జిల్ ట్రక్కులు రూ.12.40

ఓవర్ సైజ్డ్ వాహనాలు(7 లేదా అంతకంటే ఎక్కువ యాగ్జిల్స్) రూ.15.09

పెరిగిన టోల్ ఛార్జీలు (జూన్ 3) నేటి అర్ధరాత్రి 12.00 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త ఛార్జీలపై అవగాహనకు టోల్ ప్లాజా వద్ద బోర్డులు ఏర్పాటు చేసినట్లు నిర్వహణ సంస్థ తెలిపింది. వాహనదారులు సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు. కొత్త టోల్ రేట్లు, రోజు వారీ పాసులు, నెలవారీ పాసులు కోసం హెచ్.ఎం.డి.ఎ వెబ్ సైట్ https://www.hmda.gov.in/ ను సందర్శించండి.

ఎన్హెచ్ఏఐ ఉత్తర్వుల మేరకు టోల్ప్లాజాల వద్ద టోల్ రుసుములు జూన్ 3 (నేటి అర్ధరాత్రి) నుంచి పెరగనున్నాయి. ఏటా ఏప్రిల్ 1న టోల్ రుసుములు పెంచుతుండగా ఈసారి లోక్సభ ఎన్నికల కారణంగా టోల్ ఛార్జీల పెంపును వాయిదా వేయాలని ఈసీ ఆదేశించింది. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జూన్ 1తో ముగియడంతో టోల్ ధరల పెంపునకు ఈసీ అనుమతి ఇచ్చింది. దీంతో ఎన్హెచ్ఏఐ ఉత్తర్వులు జారీ చేసింది. టోల్ ఛార్జీల పెంపు సగటున 5 శాతం వరకు ఉంటుంది. పెంచిన ధరలు మార్చి 31, 2025 వరకు అమలులో ఉంటాయని ఎన్హెచ్ఏఐ ప్రకటించింది.

**హైదరాబాద్-విజయవాడ హైవే**

హైదరాబాద్విజయవాడ (NH no.65) జాతీయ రహదారిపై...తెలంగాణలోని పంతంగి, కొర్లపహాడ్, ఏపీలో చిల్లకల్లు వద్ద టోల్ప్లాజాలను జీఎంఆర్ నిర్వహిస్తోంది. కార్లు, జీపులు, వ్యాన్లకు ఒక వైపు ప్రయాణానికి రూ.5, ఇరువైపులా కలిపి రూ.10, తేలికపాటి వాణిజ్య వాహనాలు ఒక వైపు ప్రయాణానికి రూ.10, ఇరువైపులా కలిపి రూ.20, బస్సులు, ట్రక్కులకు ఒక వైపు ప్రయాణానికి రూ.25, ఇరువైపులా రూ.35, భారీ రవాణా వాహనాలకు ఒక వైపు ప్రయాణానికి రూ.35, ఇరువైపులా రూ.50 వరకు టోల్ ఛార్జీలు పెంచారు. స్థానికులకు నెలవారీ పాస్ రూ.330 నుంచి రూ. 340కి పెంచినట్లు పేర్కొన్నారు.

## 31/32 సిక్కింలో దుమ్మురేపిన ఎస్కేఎం..

డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఎస్డీఎఫ్కి చెందిన ఒక అభ్యర్థి మాత్రమే గెలవరిగారు. బీజేపీ, కాంగ్రెస్లు ఇక్కడ ఖాతా తెరవలేదు. ఎస్కేఎం విజయం అనంతరం పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సిక్కిం అసెంబ్లీ మెజారిటీ మార్క్ 17. 2019లో ఎస్కేఎం ఇక్కడ 17 సీట్లు గెలిచింది. ఎస్డీఎఫ్ 15 చోట్ల విజయం సాధించింది. నాడు గట్టిపోటీనిచ్చిన ఎస్డీఎఫ్.. ఇప్పుడు చేతులెత్తేసింది. అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. 60 సీట్లల్లో 46 చోట్ల గెలిచింది. ఎన్పీపీ 5 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ కు 1 సీటు, ఇతరులకు 8 సీట్లు దక్కాయి.

## నేడు రౌస్ అవెన్యూ కోర్టుకు కవిత

అంగీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కవిత, చరణ్ప్రీత్లు ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉండడంతో వారికి న్యాయస్థానం ప్రొడక్షన్ వారెంట్లు జారీ చేసింది. దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్లను జూన్ 3న కోర్టు ముందు హాజరు పర్చాలని ఆదేశించింది. అయితే, కవిత జ్యుడీషియల్ కస్టడీ కూడా 3తోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో కవితతోపాటు మిగిలిన వారిని సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నారు. కవిత కస్టడీని మరో 14 రోజులు పొడిగించాలని దర్యాప్తు సంస్థలు కోరే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. కవిత బెయిల్ పిటిషన్పై ఢిల్లీ హైకోర్టులో వాదనలు ముగియగా, న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మే నెలాఖరులోనే తీర్పు వస్తుందని ఆశించినప్పటికీ, రాలేదు. జూన్ నెలాఖరు వరకు హైకోర్టుకు సెలవులు కావడంతో ఆమె ఈ నెలంతా జైల్లోనే ఉండనున్నారు.

# ఘనంగా తెలంగాణ అవతరణ వేడుకలు

▶▶ మొదటిపేజీ తరువాయి

అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ'ను పాటను రేవంత్రెడ్డి విడుదల చేశారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతానికి ఎంఎం కీరవాణి స్వరాలందించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక రాష్ట్ర కలను నిజం చేసిన సోనియాగాంధీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. "బానిసత్వాన్ని తెలంగాణ భరించదు. సంక్షేమం ముసుగులో ప్రజాస్వామ్యాన్ని హరిస్తే తెలంగాణ సహించదు. ముళ్ల కంచెలు, ఇనుప గోడలు తొలగించాం. పాలనను ప్రజల దగ్గరకు తెచ్చాం. సచివాలయంలోకి సామాన్యుడు వచ్చేలా చేశాం. ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేసుకునేందుకు అనుమతిచ్చాం. ప్రతి పక్షాలకు గౌరవం ఇచ్చాం" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు.

**సందడిగా ట్యాంక్ బండ్.. అంగరంగా వైభవంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ట్యాంక్ బండ్ ముస్తాబైంది. వేడుకలను చూడటానికి వచ్చే వీక్షకులతో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. తెలంగాణ పదేళ్ల సంబరాలను చూడటానికి ప్రజలు భారీగా వస్తున్నారు. ఓ వైపు నగరంలో వర్షం పడుతున్నా కూడా వేడుకలను తిలకించేందుకు ప్రజలు అత్యధికంగా వస్తుండటంతో ట్యాంక్బండ్ పరిసరాలు జనాలతో కిటకిటలాడుతున్నాయి. వీక్షకుల కోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. తెలంగాణ కళారూపాలను కళాకారులు ప్రదర్శిస్తున్నారు. సాయంత్రం 6:30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

కార్నివాల్, లేజర్ షో, ఫుడ్, గేమింగ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్ వద్ద భారీ వర్షం పడుతోంది. భారీ వర్షంలో సైతం సంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వర్షంలో తడుస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు వీక్షిస్తున్నారు. 8:50 నిమిషాల నుంచి పది నిమిషాల పాటు ట్యాంక్ బండ్ పై ఫైర్ వర్క్స్ ప్రదర్శించనున్నారు. తెలంగాణకు సంబంధించిన హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ట్యాంక్ బండ్పై ఏర్పాటు చేశారు. ట్యాంక్బండ్ వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను మరికాసేపట్లో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సందర్శించనున్నారు. తెలంగాణ కళారూపాల అద్భుత ప్రదర్శనకు అద్దం పట్టే కార్నివాల్ నిర్వహించ నున్నారు.కార్నివాల్లో 700 మంది కళాకారులు పాల్గొననున్నారు. వేదికపై 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రదర్శించనున్నారు. స్టేజ్ షో అనంతరం జాతీయ జెండాలతో ట్యాంక్ బండ్పై ఇటు చివర నుంచి అటు చివరి వారకు భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహించనున్నారు. ఫ్లాగ్ వాక్లో 5 వేల మంది పాల్గొననున్నారు. ఫ్లాగ్వాక్ జరుగుతున్నంత సేపు జయ జయహే తెలంగాణ ఫుల్ వర్షన్ గీతం విడుదల చేయనున్నారు. ఈ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అందెశ్రీ, సంగీత, కీరవాణికి సన్మానం చేయనున్నారు. కార్యక్రమ ముగింపుగా పది నిమిషాల పాటు హుస్సేన్ సాగర్ మీదుగా ఆకాశంలో రంగులు విరజిమ్మేలా ఫైర్ వర్క్స్ ఏర్పాట్లు చేశారు.



## సోనియా గాంధీ ప్రత్యేక సందేశం

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక వీడియో సందేశం విడుదల చేశారు. అమర వీరుల త్యాగాలను ఆమె గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర స్వప్నాన్ని నెరవేర్చామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తుందని హామీనిచ్చారు.



## బానిసత్వాన్ని తెలంగాణ భరించదు

తెలంగాణ అస్థిత్వానికి, ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరిగి పదేళ్లు అవుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించారు. ఆరు దశాబ్దాల కలను నెరవేర్చిన ఆ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. బానిసత్వాన్ని తెలంగాణ భరించదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ యువత కోరుకున్నట్టుగా టీఎస్ స్థానంలో టీజీ ఏర్పాటు చేశామని వివరించారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టే సమయానికి రాష్ట్రం 7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్ గుర్తుచేశారు. రాష్ట సంపద పెంచడం, ఆర్థిక పునరుజ్జీవనం సాధించడం కోసం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కంకణబద్ధులై పనిచేస్తున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజిస్తున్నామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి ఔటర్ రింగ్ రోడ్ వరకు అర్బన్ తెలంగాణగా ఉంటుందని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజనల్ రింగ్ రోడ్ వరకు సబర్బన్ తెలంగాణ అని.. రీజనల్ రింగ్ రోడ్ నుంచి తెలంగాణ సరిహద్దు వరకు గల ప్రాంతాన్ని గ్రామీణ తెలంగాణగా పరిగణిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## కేసీఆర్ ఇంట్లో భోంచేసిన కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబం..

- కూతురు మెడికల్ కోర్సుకు ఆర్థిక సాయం



తెలంగాణ అవిర్భావ దినోత్సవాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అమరులు త్యాగాలకు గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆదివారం ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని ఆయన నందినగర్లోని తన ఇంటికి పిలిపించుకున్నారు. కిష్టయ్య ప్రాణ త్యాగంతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి తాను అండగా ఉంటానని వారికి భరోసానిచ్చారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన కిష్టయ్య కూతురు ప్రస్తుతం పీజీ చేస్తోంది. ఈ మేరకు మెడికల్ కాలేజీలో కట్టాల్సిన ఫీజు కోసం కావలసిన రూ.24 లక్షల రూపాయల చెక్కును ఇవాళ కిష్టయ్య కుటుంబానికి కేసీఆర్ అందజేసి వారితో కలిసి భోజనం చేశారు. అమ్మను కష్టపెట్టకుండా చూసుకోవాలంటూ కిష్టయ్య పిల్లలకు కేసీఆర్ సూచించారు.

## ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు



✍ జయభేరి, హైదరాబాద్:

తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్.

బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు దశాబ్ది ఉత్సవాలను పండగ వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఛత్తీస్గఢ్ రాష్ట్ర అవతరణ సందర్భంగా అక్కడ మూడ్రోజులు పండగ నిర్వహించారని, కానీ పది సంవత్సరాల వేడుకలను ఇక్కడ ఒక్క రోజుకు పరిమితం చేయడంపై మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డికి పరిపక్వత, అవగాహన లేదని, తెలంగాణ ఏర్పాటు వెనక ఉన్న చరిత్ర, త్యాగాల గురించి ఆయనకు తెలియదన్నారు. రేవంత్ రెడ్డి జాక్ పాట్ ముఖ్యమంత్రి అన్నారు. ఇవాళ ఉదయం రేవంత్ రెడ్డి పెట్టిన మెసేజ్లో కనీసం "జై తెలంగాణ" అనలేదని, అలాంటి వ్యక్తికి కేసీఆర్, తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

## గాంధీభవన్లో 'దశాబ్ది' ఉత్సవాలు

- పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు



ఎన్టీఆర్భవన్, సీపీఐ కార్యాలయాల్లోనూ వేడుకలు

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు గాంధీభవన్లో ఆదివారం ఘనంగా జరిగాయి.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్గౌడ్, ఎంపీ అనిల్ యాద వ్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సేవాదళ్ మార్చ్ను జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా ప్రజలు కాంగ్రెస్ గెలిపించి కానుకగా ఇచ్చారని చెప్పారు.

**ఎన్టీఆర్ భవన్లో..**

తెలంగాణ ఆవిర్భావ వేడుకలను టీటీడీపీ ఘనం గా నిర్వహించింది. ఎన్టీఆర్ భవన్లో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీని అభివృద్ధి చేసి హైదరాబాద్కు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని చంద్రబాబు లేఖ ఇచ్చిన తర్వాతే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజు నాయక్, పార్టీ నేతలు షేక్ ఆరిఫ్, జయరాం చందర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా పాలన సాగాలి: నారాయణ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా నియంతృత్వ ధోరణితో కాకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ సర్కారు పాలించాలని సీపీఐ జాతీయ నేత కె.నారాయణ సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డితో కలిసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలించిన కేసీఆర్ ప్రభుత్వానికి పదేళ్లకే నూరేళ్లు నిండాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ కలుపుకొని ముందుకెళ్లాలని సూచించారు. కూనంనేని మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం సీపీఐ వీరోచిత పోరాటం చేసిందన్నారు.

## రేవంత్పై పరోక్ష విమర్శలు..

ఈ నిర్వహించిన ఈ వేడుకలకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. తెలంగాణ ఉద్యమ రోజులను స్మరించుకున్నారు. ఈ రోజు ఉద్విగ్న భరితమైన రోజు అని పేర్కొన్నారు. తెలంగాణను, తెలంగాణ ప్రజలను ఎలా గోస పెట్టారో వివరించారు. కొందరు తెలంగాణ నినాదం ఎత్తుకొని మధ్యలోనే కాడి పడేశారని కేసీఆర్ అన్నారు. శాసనసభలో తెలంగాణ పదమే అనొద్దని నిషేధం పెట్టారని గుర్తు చేశారు. ముల్కీ రూల్స్ రద్దు చేసినా.. దిక్కు మొక్కు లేదన్నారు. నాడు కాంగ్రెస్లో 11 ఎంపీలు గెలిచినా ఇందిరాగాంధీ కనికరించలేదని గుర్తు చేశారు కేసీఆర్. అలాంటి సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కోసం పని చేశారుని.. ఆయన పోరాట స్ఫూర్తిని కేసీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ లాంటివారు ఎప్పటికైనా రాకపోతారా అని జయశంకర్ ఎదురు చూశారని.. ఇదే విషయాన్ని అనేకసార్లు తనతో చెప్పినట్లు కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం చివరి వరకు నిలబడాలని జయశంకర్ తనతో చెప్పారన్నారు. ఆనాడు కాంగ్రెస్, టీడీపీ నేతలు వాళ్ల స్వార్థం కోసం పని చేశారని.. తెలంగాణ కోసం ఎవరూ స్పందించలేదన్నారు. తెలంగాణ నేతలు సీఎం అయితే పూర్తి కాలం పదవిలో ఉండకుండా మధ్యలోనే దించేశారని కేసీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని సైతం తన చేతిలో పెట్టుకున్న పవర్ ఫుల్ సిఎం ఉన్న సమయంలో తాను ఉద్యమ బాటపట్టానని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ వస్తేనే తెలంగాణ రైతులకు న్యాయం జరుగుతుందని తాను భావించానన్నారు. నాడు సుద్దాల అశోక్ తేజకు తెలంగాణ పాట రాయరాకపోతే.. తానే చెప్పి రాపించానని గుర్తు చేశారు. ఆరోజులు గుర్తుకు వస్తే దుఃఖం వస్తుందని కేసీఆర్ ఉద్వేగానికి గురయ్యారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తమకు ఆఫీస్ ఇస్తే ఆయన ఇల్లు కూలగొట్టారన్నారు. అనేక ప్రయాసలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని.. గులాబీ జెండాది 20ఏళ్ల ప్రస్థానం అని కేసీఆర్ పేర్కొన్నారు. మోకాలు ఎత్తులేని వాడు కూడా బీఆర్ఎస్ ను ఖతం చేస్తా అంటున్నాడని.. బీఆర్ఎస్ను ఎవరూ ఖతం చేయలేరని కేసీఆర్ అన్నారు. అసెంబ్లీలో ఓడామని.. తాను మళ్లీ బస్సు యాత్ర మొదలు పెట్టగానే తెలంగాణ గర్జించిందన్నారు. ఇప్పుడు వచ్చేవి టెంపరరీ సెట్ బాక్స్ అని.. తమకంటే ముందు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఖతం అయ్యిందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. రేపు అధికారంలోకి రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అడ్డగోలు హామీలతో అప్పుడప్పుడు భ్రమిస్తారన్నారు. ఆ కారణంగానే మొన్నటి ఎన్నికల్లో 1.8 శాతం ఓట్ల తేడాతో ఓడిపోయామని పార్టీ శ్రేణులకు చెప్పారు.

**ఎర్రి మొర్రి చర్యలు..**

ప్రభుత్వం వేస్తున్న ఎర్రి మొర్రి చర్యలతో ఆశ్చర్యం కలుగుతోందని కేసీఆర్ ఫైర్ అయ్యారు. ప్రభుత్వ అసమర్థత అర్థం కావడం లేదన్నారు. హరీష్రావు వల్లనే కరెంట్ కట్ అవుతుందని సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడుతున్నారని.. ఈ రాష్ట్రానికి సీఎం హరీష్ రావా? లేక రేవంత్ రెడ్డినా? అని కేసీఆర్ ప్రశ్నించారు. సీఎం స్థాయి వ్యక్తి అలా మాట్లాడతారా? అని నిలదీశారు. రైతు బంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అందుకే ప్రజలు ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి అంటున్నారని.. ప్రభుత్వానికి స్టెప్ డౌన్ స్టార్ట్ అయిందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి దాన్ని చిల్లర రాజకీయం చేస్తోందని విమర్శించారు. కల్లు దుకాణాల మీద దాడులు చేస్తూ గీతా కార్మికులను బతికనివ్వడం లేదన్నారు. తాము ఉండగా వేసిన దళిత బంధు డబ్బులు ఫ్రీజ్ చేశారని కేసీఆర్ ఆరోపించారు. అనతికాలంలోనే ప్రభుత్వం అప్రతిష్ఠ పాలైందన్నారు.

**ఫలితాలపై కేసీఆర్ స్పందన..**

పార్లమెంట్ ఫలితాలు ఎలా వస్తాయో చూద్దామని కేసీఆర్ అన్నారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ గెలిపించిన జిల్లా నేతలకు అభినందనలు తెలియజేశారు. వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ కూడా తమ పార్టీ రాకేష్ రెడ్డి మొదటి రౌండ్లోనే గెలుస్తున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎగ్జిట్ పోల్స్ పెద్ద గ్యాంబ్లింగ్ అని.. ఫలితాలు ఎలా వచ్చినా కృంగిపోమన్నారు. మహబూబ్నగర్ సీఎం సొంత జిల్లా అని.. అక్కడే తాము గెలిచామని చెప్పారు. గెలిస్తే పొంగిపోము, ఓడితే కృంగిపోము అని స్పష్టం చేశారు. ఫలితాలతో ఆగం ఆగం కావొద్దని.. సమీప భవిష్యత్లో మళ్లీ పాలన భాధ్యత మన భుజాల మీదకే వస్తుందని పార్టీ శ్రేణుల్లో భరోసా నింపారు కేసీఆర్.

**అన్నీ కొండెంగ చేష్టలు..**

సీఎం, మంత్రుల కొండెంగా చేష్టల వల్ల రాష్ట్రంలో కరెంట్ కోతలు ఏర్పడుతున్నాయని కేసీఆర్ విమర్శించారు. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కొత్త పాలసీ తీసుకురాలేదన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ లోగో మార్పు అంశంపై కేసీఆర్ స్పందించారు. ఏ నిర్ణయం తీసుకున్నా తాము సమిష్టిగా తీసుకున్నామన్నారు. నూతన ఉద్యమ పంథా కార్యాచరణ త్వరలో ప్రకటించుకుని ముదుకు వెళ్తామని స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ వేడుకలు రెండు రోజులు నిర్వహిస్తామని.. చివరి శ్వాస వరకు నేను తెలంగాణ కోసం పని చేస్తానని అన్నారు.

# తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్

- తెలంగాణ సమాజ ప్రగతి, సంక్షేమమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పాలన
- దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పీర్జాదిగూడలోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు




**జయభేరి, మేడిపల్లి :**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకల లో భాగంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ సూచనలతో పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నగర పరిధిలోని సాయి సురక్ష వృద్ధాశ్రమంలో వృద్దులకు పండ్ల



పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ రాష్టాన్ని సాధించి, స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలంపాటు ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఎంతో మంది త్యాగాలకోర్చి సాధించుకున్న తెలంగాణలో సమాజ ప్రగతి, సంక్షేమమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన నిజమైన ప్రజా సంక్షేమ పాలన స్ఫూర్తితో పదేండ్ల పాటు ప్రజల భాగస్వామంతో సాధించిన ప్రగతిని ప్రజాసంక్షేమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల,డివిజన్ల అధ్యక్షులు జావీద్ ఖాన్,ఆంజనేయులు, బాలరాజు,వెంకన్న,యాసారం శ్రీనివాస్, కిరణ్, జగన్ రెడ్డి,శంకర్ రావు, మల్లం వెంకట్ గౌడ్,వరికల శ్రీనివాస్, చిర్ర సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు

**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి, అమరులకు శ్రద్ధాంజలి ఘటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. అనంతరం ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల తో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

- పాల్గొన్న మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఅర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, ఇంచార్జ్ బోమ్మక్ విశ్వనాధ్



**జయభేరి, బోడుప్పల్, జూన్ 2 :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 19వ డివిజన్ లో బీఅర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బోమ్మక్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నగర మేయర్ సామల బుచ్చిరెడ్డి,నగర పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డిలు పాల్గోని జెండాను అవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.... నీళ్లు, నిధులు, నియామకాలు.. ఈ నినాదంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేసింది. కోట్లాది మందిని ఏకం చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన దిశగా సాగింది. ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగఫలంతో, ఉద్యమకారుల పోరాటంతో 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో అన్ని వర్గాలవారు పాల్గొన్నారన్నారు. ఎంతోమంది ఈ రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేశారని, తెలంగాణ ఉద్యమ అమరవీరులందరికీ, వారి అంకిత భావానికి హృదయపూర్వకంగా నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్,నాయకులు తిరుపతి యాదవ్, తాల్కశత్రజ్ఞ, సాయి కిరణ్, స్రవంతి, రాధ, యూత్ నాయకులు పులకండ్ల కీర్తన్ రెడ్డి, ఉప్పరి విజయ్, వినయ్ తదితరులు పాల్గోన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**జయభేరి, మేడ్చల్ :**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 23 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200102 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం మైసమ్మగూడలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో స్నేహితులతో ఆత్మీయంగా పలుకరించుకుని విందు, వినోదాలతో సాయంత్రం వరకు సందడిగా గడిపారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, భేరి బాలరాజు, అమరం హేమంత్ రెడ్డి, సాయిపేట శ్రీనివాస్, దొడ్ల మల్లికార్జున్, కో అప్షన్ సభ్యులు దేవేందర్, మాజీ సర్పంచ్ లు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, బండారి నరేందర్, నాయకులు అమరం మోహన్ రెడ్డి, సంజీవ్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, సురేందర్ గౌడ్, మేనేజర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రి ప్రొఫెషనల్స్ సమావేశం



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ అగ్రి ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం మేడ్చల్లోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు రవి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేడ్చల్ మున్సిపాలిటీతో పాటు మండలానికి చెందిన అగ్రి ప్రొఫెషనల్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సమావేశంలో వారి సమస్యలు. కమిటీ అభివృద్ధిపై చర్చించుకున్నారు. కమిటీ సభ్యులకు అన్ని విధాల అసోసియేషన్ అండగా నిలుస్తుందని అధ్యక్షులు రవి తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సత్తిరెడ్డి. డాక్టర్ కలియుగం, కేవీ రావు, బీమయ్య, రవింద్ర, దాసు, సభ్యులు పాల్గొన్నారు.



## ఉమ్మడి శామీర్ పేట మండల వ్యాప్తంగా ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాలను ఎగురవేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు
- అమరుల ఆత్మ బలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయిందన్న వక్తలు

**జయభేరి, జూన్ 2:**

మేడ్చల్ జిల్లా ఉమ్మడి శామీర్ పేట్ మండల వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తూంకుంట మున్సిపాలిటిలో చైర్మన్ కారంగుల రాజేశ్వర్ రావు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. శామీర్ పేట్ తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, శామీర్ పేట్ పోలీస్ స్టేషన్లో సిఐ శ్రీనాథ్, జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ లో సిఐ యాదయ్య, మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి,మూడు చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి హారికమురళిగౌడ్, రైతు వేధిక వద్ద ఏ వో కృష్ణవేణి, ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దమయంతి, ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంపిణి చేశారు. ఎందరో బలిదానాల వల్లే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ లు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ పీత కేసీఆర్

- మూడు చింతలపల్లి లో కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**జయభేరి, జూన్ 2:**

తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఆదివారం మూడు చింతల పల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ జాం రవి అద్వర్యం లో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జాం రవి మాట్లాడుతూ.. అమరుల బలిదానాలతో వచ్చిన తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండేలా పరిపాలనా పది సంవత్సరాలు అందించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాం రవి, వెంకటనర్సింహరెడ్డి (బాబు), నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# నలుగురికి సేవ చేయటం సామాజిక బాధ్యత

**జయభేరి, రాజేంద్రనగర్ :**



రాజేంద్రనగర్ బండ్లగూడ జాగీర్ లోని కస్తూర్బా ఆశ్రమంలో ప్రముఖ సంఘ సేవకులు, యువ వ్యాపార వేత్త యనమల రాజు.. తన జన్మదిన వేడుకలు సింపుల్ గా చేసుకున్నారు.. ఈ సందర్బంగా ఆయన మిత్ర బృందం ఆశ్రమంలోని వృద్ధులు, మానసిక వికలాంగులకు అల్పాహారం అందజేశారు.. పళ్ళు కూడా పంపిణీ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, మహిళలు, గృహిణులకు చేయూత ఇవ్వడంతో, రిటైర్డ్ ఎంప్లాయిస్ కు కూడా తోడ్పాటు ఇస్తామని యనమల రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ పులిమామిడి నారాయణ, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సింగిరెడ్డి నిరంజన్ హాజరయ్యారు. యనమల రాజు సేవా నిరతిని, సేవా గుణాన్ని కొనియాడారు.. నలుగురికి సేవ చేయటాన్ని.. వ్యాపార వేత్తలు తమ సామజిక బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో BRS ముఖ్య నేతలు రాముడు యాదవ్, చందు మలుల, స్వామి, కాంగ్రెస్ నాయకులు రామ్ ప్రసాద్, బాలకృష్ణ, పలు కాలనీల వాసులు కోటేశ్వరరావు, ఆనంద్ ప్యారీ, అమ్డాపూర్ వెంకటేష్, పెరుగు శ్రీనివాస్, సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.



# కోళ్ల ఫారం ను తొలగించాలని గ్రామస్తుల ఆందోళన

- దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన. అధికారులు స్పందించాలని డిమాండ్

**జయభేరి, జూన్ 2:**



తమ గ్రామ పరిధిలో ఉన్నటువంటి కోళ్లఫారమ్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా లక్ష్మాపూర్ గ్రామ యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ రెవెన్యూ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర హెచరిస్ ఫౌల్ట్రీ ఫారమ్ ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం యువ నాయకులు క్యాతం మధుకృష్ణ, మాజి వార్డు సభ్యుడు ఎల్లగౌని బాలేష్, సాయి, శ్రీనివాస్ చారీలు మాట్లాడుతూ కోళ్ల ఫారమ్ లో చనిపోయిన వందలాది బాయిలర్ కోళ్లను ప్రతిరోజు కాల్చి వేస్తుండంతో దుర్వాసన వస్తుందని ఆరోపించారు. గత కొద్ది రోజులుగా లక్ష్మాపూర్ గ్రామ పరిసరాల్లోకి దుర్వాసన రావడంతో వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారని చిన్నపిల్లలు అస్వస్థతకు గురవుతున్నారని వాపోయారు. ఇక రాత్రి వేళల్లో అయితే ఇండ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొందని, ముక్కుపుటాలు అదిరే దుర్వాసనతో అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. గతంలో కోళ్లఫారమ్ సూపర్వైజర్లకు ఈ విషయమై పిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేదన్నారు. అప్పట్లోనే ఈ ప్రాంతంలో కోళ్లఫారమ్ పెట్టవద్దని గ్రామస్థులు ఆందోళన చేపట్టామని, అయినా కూడా ఈ సమస్యకు చెక్ పెట్టలేదన్నారు. నిత్యం కోళ్లఫారమ్ నుంచి వస్తున్న దుర్వాసనతో ఊపిరి ఆడక ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని వాపోయారు. ఇప్పటికైన కోళ్లఫారమ్ యజమానులు స్పందించి దుర్వాసన, ఈగలు రాకుండా చూడాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పెద్ద ఎత్తున దర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజి వార్డు సభ్యుడు బండి రవిందర్, యువకులు సింగం భాస్కర్, బౌండ్ల మోహన్, ఎల్లగౌని నవీన్ కుమార్, బీమరి రాజేష్, సుజితా పాల్, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

- సోనియా చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నేతలు
- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుంది - మండల కాంగ్రెస్ పార్టి అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహా యాదవ్

**జయభేరి, జూన్ 2:**

తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారం చేసిన దేవత సోనియాగాంధీ అని, ఆమెకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని వీరారెడ్డి విగ్రహం వద్ద జెండాను ఎగురవేసి సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాయాంలో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ఆరు గ్యారంటీలను అమలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం సాదించుకుని పదేళ్లు గడిచిన ఎక్కడ అభివృద్ధి జాడ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల బలిదానాలతో వచ్చిన తెలంగాణను గత పాలకులు రాబందుల్లా దోచుకున్నారని, అమరుల ఆశయాలకు తూట్లు పొడిచారని విమర్శించారు. దశాబ్ది ఉత్సవాలను కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా చేపడుతుందని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండేలా పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ఎంపిటిసిలు హన్మంతరెడ్డి, అఖిలేష్ రెడ్డి, మాజి సర్పంచ్ లు దోసకాయల వెంకటేష్, బాలనర్సింహా, మాజి ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి, సీనియర్ నాయకులు బండి జగన్నాధం, వంగ లక్ష్మారెడ్డి, విష్ణుగౌడ్, జైపాల్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్ రావు, కీసరి నర్సింలు, బస్వారెడ్డి, శేఖర్ రెడ్డి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆధ్వర్యంలో రెపరెపలాడిన జాతీయ జెండా



**జయభేరి, దేవరకొండ :**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటితో పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో,తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని దేవరకొండ పట్టణంలోని ప్రముఖ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీరాములు ,ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నల్లగాసు జాన్ యాదవ్, జాతీయ జెండా ఎగర వెయ్యగా, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నరసింహ జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చుకున్న రోజు జూన్ రెండవ అని తెలిపారు. మన పాలన,మన ఉద్యోగాలు,మన నీళ్లు,మన నిధులు,అంటూ సాగిన అనేక సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తెలంగాణ అమరవీరుల కల స్వప్నమైన వేళా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మా అమ్మను బతికించండి

- రూ.30 లక్షల వరకు అవుతుందన్న బసవతారకం వైద్యులు

**జయభేరి, హైదరాబాద్, జూన్ 2:**

ఆ రోజు పనికి వెళ్లకపోతే మరుసటి రోజు ఐదువేళ్లు నోట్లోకి వెళ్లలేని స్థితిలో కూడా ఉన్నంతలో సంతోషంగా గడుపుతున్న ఆ కుటుంబానికి క్యాన్సర్ మహమ్మారి ఆ సంతోషం కూడా లేకుండా చేసింది. ఇంటిపెద్ద భార్య కు క్యాన్సర్ సోకడంతో వైద్యం కోసం ఇప్పటికే లక్షల్లో ఖర్చు పెట్టారు. మందులకే నెలకు రూ.40వేలు అవుతోంది. ఆమెకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బీఎంటీ) చేయాలని, ఇందుకు రూ.30లక్షలు అవుతుందని బసవతారకం వైద్యులు చెప్పారు. బీఎంటీ చికిత్స ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోవడంతో ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన అనుముల పద్మ (49)ఉపాధి కోసం తోపుడు బండిపై అరటిపండ్లు అమ్ముతోంది. ఆమె భర్త కూలీ. ముగ్గురు సంతానంలో అమ్మాయికి పెళ్లయింది. కుమారుడు రాజు బీటెక్ పూర్తి చేయగా మరో కుమారుడు ఖాళీగా ఉన్నాడు. నిరుడు డిసెంబరు చివర్లో పద్మకు ఉన్నట్లుండి జ్వరమొచ్చింది. వైద్యుడికి చూపించినా మళ్లీ మళ్లీ వస్తుండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జనవరి 15న చేర్పించి మూడు రోజుల పాటు పరీక్షలు చేయించారు. బ్లడ్ క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. అక్కడే రూ.1.25 లక్షల బిల్లు అయింది. ఆ ఆస్పత్రిలో ఉంటే వైద్య ఖర్చులను భరించలేమని భావించి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో పద్మను చేర్పించారు. అక్కడి వైద్యులు పరీక్షించి.. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బీఎంటీ) చేయాలని, అందుకు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసి ఇచ్చారు. బీఎంటీ ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాదని అక్కడి వైద్యులు తెలిపారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స కోసం అప్పు చేసి రూ.9లక్షల దాకా ఖర్చు చేశారు. చేతిలో డబ్బు లు లేకపోవడంతో మందులు వాడడటం లేదని, అమ్మ ఆరోగ్యం క్షిణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. బీఎంటీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి చికిత్సకు సహకరించి ఆదుకోవాలని కోరారు. దాతలు పెద్ద మనసుతో స్పందించి ఆదుకోవాలని, దాతలు 9666768636 సంప్రదించాలని విజ్ఞప్తి చేశాడు.

# రాత్రి 7 గంటలకంటే ముందుగా భోజనం

- రాత్రి భోజనం ఎంత త్వరగా చేస్తే ఆరోగ్యానికి అంత మంచిది. కానీ ఈ విషయం తెలియక అందరూ అర్ధరాత్రుల్లు తింటారు. నిజానికి 7 గంటలకంటే ముందుగానే భోజనం చేయాలి.





మీ మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, ఆరోగ్యంగా, చురుకుగా ఉండటానికి ఆరోగ్యకరమైన ఆహారం అవసరం. కానీ సరైన ఆహారం తీసుకోవడం మాత్రమే మీరు ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడదు. అందుకు సరైన సమయానికి ఆహారం తీసుకోవడం కూడా ముఖ్యం. ఫిట్‌నెస్‌ను కాపాడుకునే చాలా మంది వ్యక్తులు రాత్రి 7 గంటలలోపు రాత్రి భోజనం చేయడం అలవాటు చేసుకుంటారు. రాత్రి 7 గంటల లోపు రాత్రి భోజనం చేయడం వల్ల మీ శరీరం పూర్తిగా మారిపోతుంది. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార నిపుణులు అర్ధరాత్రి తినడాన్ని వ్యతిరేకిస్తారు. తొందరగా రాత్రి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలని చెబుతారు. ఇది శరీరం ప్రధాన విధులను తదనుగుణంగా షెడ్యూల్ చేస్తుంది. ఈ అంతర్గత గడియారం, సిర్కాడియన్ రిథమ్ అని పిలుస్తారు. శరీరం పర్యావరణ మార్పులు, నిద్ర, జీర్ణక్రియ, ఆహారం వంటి కార్యకలాపాలకు సర్దుబాటు చేయడంలో సహాయపడుతుంది.

మీ భోజనం సమయం మీ బరువు నియంత్రణ, జీవక్రియ నియంత్రణ, హృదయ స్పందన రేటు, నిద్ర చక్రంపై కూడా ప్రభావం చూపుతుందని గ్రహించండి. బరువు తగ్గడం, మంచి జీర్ణక్రియ, గుండె ఆరోగ్యం కోసం ఆరోగ్య నిపుణులు రాత్రిపూట ముందుగానే తినడం సిఫార్సు చేస్తారు. రాత్రి 7 గంటల లోపు రాత్రి భోజనం చేయడం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలను చూడండి..

**జీర్ణవ్యవస్థ బాగుంటుంది**

మీరు ఆలస్యంగా తిన్నప్పుడు తిన్నవన్నీ జీర్ణించుకోవడానికి మీ జీర్ణవ్యవస్థకు తగినంత సమయం ఉండదు. ఇది అజీర్ణం లేదా గుండెల్లో మంటను కలిగిస్తుంది. భోజనం, నిద్ర మధ్య మంచి మొత్తంలో గ్యాప్ ఉండాలి. రాత్రిపూట ఆలస్యంగా తింటే జీర్ణక్రియ సరిగా జరగక నిద్ర సరిగా పట్టదు. మీరు త్వరగా తింటే ఆహారం మీ శరీరానికి బాగా శోషించబడుతుంది. బాగా నిద్రపోగలుగుతారు. మంచి రాత్రి నిద్ర మరుసటి రోజు కూడా మీలో శక్తిని నింపుతుంది.

**గ్యాస్, ఎసిడిటీ రావు**

త్వరగా రాత్రి భోజనం చేయడం వల్ల మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మీ శరీరం ఆహారాన్ని బాగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. రాత్రి పూట త్వరగా తినడం వల్ల గ్యాస్, ఎసిడిటీ, గుండెల్లో మంట వంటి అన్ని సమస్యలను నివారించవచ్చు.

**బరువు తగ్గవచ్చు**

బరువు తగ్గాలనుకునే వారు తమ భోజన సమయాలను ఎల్లప్పుడూ గమనించాలి. రాత్రి భోజనం త్వరగా తినడం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనాల్లో ఒకటి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నిద్రపోతున్నప్పుడు శరీర కొవ్వును శక్తి కోసం ఉపయోగిస్తారు. తద్వారా కొవ్వును కోల్పోతారు. రాత్రిపూట ఆలస్యంగా తింటే ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవచ్చు. మొత్తం బరువు పెరగవచ్చు.

**రక్తపోటు**

నిద్రవేళకు, రాత్రి భోజనానికి మధ్య రెండు గంటల గ్యాప్ ఉండాలి. అర్ధరాత్రి భోజనం చేసేవారు హైపర్‌టెన్షన్ తో బాధపడే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో రాత్రి రక్తపోటు సరిగ్గా తగ్గదు. ఒత్తిడి పెరిగితే, గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

**గ్యాప్ మెయింటెయిన్ చేయాలి**

మీ డిన్నర్, బెడ్ టైం మధ్య గ్యాప్ మెయింటెయిన్ చేయడం వల్ల కొంత వరకు ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. రాత్రి త్వరగా భోజనం చేసిన తర్వాత లేదా మీకు ఆకలిగా అనిపించినప్పుడు ఆకలితో అలమటించడం కూడా మంచిది కాదు. అటువంటి సమయాల్లో మీరు తక్కువ కేలరీలు, అధిక ప్రోటీన్లు, తక్కువ కార్బోహైడ్రేట్ ఆహారాలను తీసుకోవచ్చు.

# ఓటమిని ముందే ఒప్పుకోకండి

## విజయం సాధించే వరకు కష్టమైనా ప్రయాణాన్ని సాగించండి

- కొంతమంది చిన్న కష్టమొస్తేనే జీవితాన్ని ముగించేసుకుంటారు. తానేమీ సాధించలేం అనుకుంటారు. ఎంతోమంది స్ఫూర్తి నింపే జీవితాలు ఉన్నాయి. వారి జీవితాలను తెలుసుకుంటే మీలో కూడా జీవించాలన్న కోరిక పుడుతుంది.



మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఒక అమ్మాయి జీవితాన్ని ఎంతో కష్టంగా బతికింది. ఆమె జీవితం ఎన్నో ఏళ్ల పాటు గందరగోళంగానే ఉంది. యుక్త వయసులోనే తల్లి చనిపోయింది. తండ్రి కూతురితో మంచి సంబంధాలను కొనసాగించలేదు. దీంతో తండ్రితో కూడా మాట్లాడే పరిస్థితి లేదు. ఆమెకు స్నేహితులంటే పుస్తకాలే. పుస్తకాలను చదువుతూనే పెరిగింది. కుటుంబ జీవితంలో కష్టాలు, ఆర్థిక సమస్యలు రావడంతో ఆమెకు డిప్రెషన్ బారిన పడింది. క్లినికల్ డిప్రెషన్ తో బాధపడుతూ ఆత్మహత్య ఆలోచనలు ఆమెకు ఎక్కువగా వచ్చేవి.

పాతికేళ్ల వయసులో చిన్న ఉద్యోగంలో చేరింది. అదే సంస్థలో చేస్తున్నా ఒక వ్యక్తితో ప్రేమలో పడింది. పెళ్ళికి ముందే తల్లి అయింది. ఆ తర్వాత ఆ వ్యక్తినే పెళ్లి చేసుకున్నా కూడా గృహహింస ఆమెను ప్రశాంతంగా ఉండనివ్వలేదు. ఆమెకు కూతురు పుట్టింది. భర్త పెట్టే బాధలు భరించలేక ఆమెకు డిప్రెషన్ మరింతగా పెరిగిపోయింది. చిన్న కూతురుతో కలిసి ఒంటరిగా వేరే దేశానికి వెళ్లిపోయింది. తన జీవితంలో జరిగిన భయంకరమైన సంఘటనలు ఆమెను కలిచి వేసాయి. జీవితంలో తాను ఓడిపోయానని భావించింది. ఆత్మహత్య చేసుకోవాలన్న కోరికలు వచ్చినా ఆ చిన్న పాప కోసం ఆలోచనలను అదిమి పెట్టేది. కనీసం బిడ్డకు అన్నం పెట్టలేని పరిస్థితికి చేరుకుంది. చిన్న బిడ్డ ఉండడం వల్ల మంచి ఉద్యోగం కూడా దొరకలేదు. దీంతో ప్రభుత్వ సహాయం కోసం చూసింది. తన బిడ్డకు, తనకు ఆశ్రయం కల్పించి ఆహారం పెట్టమని కోరింది.

దొరికిన చిన్న చిన్న ఉద్యోగాలే చేస్తూ మెల్లగా తన బిడ్డను బతికించుకుంది. 1990లో ఆమె మాంచెస్టర్ నుండి లండన్ కు రైలులో ప్రయాణం చేస్తోంది. ఆ సమయంలోనే ఆమెకు ఒక ఆలోచన వచ్చింది. కథలు పుస్తకాలు రాసి సంపాదించాలనుకుంది. చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం అంటే ఇష్టం కాబట్టి ఆమెకు ఒక అందమైన కథా స్ఫురణకు వచ్చింది. కొన్ని నెలలపాటు కథ రాసేందుకే ప్రయత్నించింది.

అలా కథలు రాయడం వెనక డబ్బు సంపాదించే అవకాశం కూడా ఉందని ఆలోచన ఆమెకు వచ్చింది. ఎందుకంటే తాను తన బిడ్డను కాపాడుకోవాలి. పిల్లల పుస్తకాలు రాయడం ద్వారా డబ్బు సంపాదించే అవకాశం ఉందని తెలిసి ఆమె ఆ ప్రయత్నం చేసింది. అలా 1995లో ఆమె ఒక పుస్తకాన్ని చేత్తోనే రాసింది. తర్వాత పాత మాన్యువల్ టైప్ రైటర్ లో టైప్ చేసింది. ఆ పుస్తకాన్ని పట్టుకొని 12 పబ్లిషింగ్ హౌసులకు తిరిగింది. ఒక్కరు కూడా ఆ పుస్తకాన్ని అచ్చు వేసేందుకు ముందుకు రాలేదు. అయినా కూడా ఆమె పట్టు విడవకుండా తిరిగింది. చివరికి ఒక ఎడిటర్ ఆమె పుస్తకాన్ని పబ్లిష్ చేసేందుకు ఒప్పుకున్నాడు. ఆ పుస్తకం పబ్లిష్ అయ్యాక ఆమె పెద్ద సెలబ్రిటీగా మారిపోయింది. ఆమె ఇంకెవరో కాదు జెకే. రౌలింగ్. పన్నెండు సార్లు పబ్లిష్ చేయడానికి రిజెక్ట్ అయిన పుస్తకం తొలి హ్యారీ పోటర్ సిరీస్ పుస్తకం. ఆమె తన కష్టానికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నా లేక గృహహింస భరిస్తూ భర్తతోనే జీవించినా ఇంత పెద్ద రచయిత్రి కాలేదేమో. కేవలం హ్యారీపోటర్‌ను తన కూతుర్ని బతికించుకోవడం కోసమే ఆమె రాసింది. కానీ ఇప్పుడు ఆమె ఒక పెద్ద రోల్ మోడల్‌గా మారిపోయింది. బ్రిటన్ లో అత్యధికంగా అమ్ముడైన పుస్తకాలలో హ్యారీ పాటర్ ఒకటి. కేవలం పుస్తకాలు రాయడం ద్వారా ధనిక మహిళగా మారిన వ్యక్తి జే కే రౌలింగ్. ఆమె బ్రిటన్లో 12వ ధనిక మహిళ ఆమె ఆస్తి కొన్ని వేల కోట్ల రూపాయలు.

విజయం సాధించిన ప్రతి వ్యక్తి వెనుక ఎన్నో కష్టాలు ఉంటాయి. వారి జీవిత చరిత్రలు చదువుతూ ఉండండి. మీ జీవితంలో ఎదురయ్యే కష్టాలు మీకు చిన్నవిగా అనిపిస్తాయి. విజయం ఎవరికి పుట్టుకతో రాదు, వారు పెరిగే క్రమంలో వచ్చే కష్టాలే వారిని రాటు దేలేలా చేస్తాయి. ఏదో ఒక రోజు కష్టపడితే విజయం దక్కి తీరుతుంది.

# మూవీభేరి



## బాలయ్యకు విలన్‌గా?

'అఖండ 2' స్క్రిప్ట్ పనుల్లో బోయపాటి బిజీబిజీగా ఉన్నారు. ఈ సినిమా కథ పూర్తి శైవత్వం నేపథ్యంలో సాగుతుందని విశ్వసనీయ వర్గాల భోగట్ట. ఇందులో విలన్ పాత్ర అత్యంత శక్తిమంతంగా రాసుకున్నారట బోయపాటి. ఆ పాత్రకోసం బాబీడియోల్, సంజయ్‌దత్‌లను కూడా కలిశారట. అయితే.. సంజయ్‌దత్ దాదాపు ఖరారైనట్టు సమాచారం. దక్షిణభారత దేశంలో శైవం ఎంత బలీయంగా ఉంటుందో, ఇక్కడి ఆలయాల ప్రాచుర్యం, వాటి ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో ఈ కథలో వివరించనున్నారట బోయపాటి. బాలయ్య, సంజయ్‌దత్‌ల పాత్రల్ని నువ్వానేనా అనేలా డిజైన్ చేస్తున్నారట. ప్రస్తుతం కె.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలయ్య నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అయ్యాక. బోయపాటి సినిమా ఉంటుందని తెలుస్తున్నది.



## రేవ్ పార్టీలకు నన్నెప్పుడు పిలుస్తారా..

ఇప్పుడు రేవ్ పార్టీల గురించి పెద్ద చర్చే జరుగుతోంది. ముఖ్యంగా బెంగళూరులో జరిగిన ఓ రేవ్ పార్టీలో సినీ నటి హేమ, ఆషీరాయ్ దొరకడం సంచలనం సృష్టించింది. దీంతో ఈ రేవ్ పార్టీల గురించి పలువురు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఓ ఈవెంట్‌లోనూ దీనిపై చర్చ నడిచింది. ఈ సందర్భంగా జబర్దస్త్ బ్యూటీ రీతూ చౌదరి కూడా రేవ్ పార్టీలపై తన అభిప్రాయాన్ని వెల్లడించింది. వాటి గురించి తెలియక రేవ్ పార్టీలకు తనను ఎప్పుడెప్పుడు పిలుస్తారా అని ఆసక్తిగా ఎదురుచూశానని బయటపెట్టింది. రేవ్ పార్టీ అంటే ఏంటో ముందుగా నాకు తెలియదు.. అదేంటో తెలియక రేవ్ పార్టీకి నాకెప్పుడు ఆహ్వానం వస్తుందా? నన్నెప్పుడు పిలుస్తారా అని ఆశగా ఎదురుచూశానని రీతూ చౌదరి తెలిపింది. కానీ రేవ్ పార్టీల గురించి తెలిసిన తర్వాత వద్దని అనుకున్నానని చెప్పింది. అయితే ఇప్పటికీ రేవ్ పార్టీలపై పూర్తి అవగాహన లేదని.. ఛానల్స్‌లో చూసి అంతో ఇంతో తెలుసుకున్నానని పేర్కొంది. డ్రగ్స్, నిషేధిత పదార్థాలు తీసుకుంటారని తెలిశాక రేవ్ పార్టీలు అవసరం లేదని ఫిక్సయ్యానని రీతూ చౌదరి ఆ షోలో చెప్పింది. సినీ ఇండస్ట్రీలోని వాళ్లు డ్రగ్స్ తెలిసి తీసుకుంటున్నారో.. తెలియక తీసుకుంటున్నారో వాళ్లకే తెలియాలని పేర్కొంది.



## మహారాణి ఉత్పలదేవిగా..

శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'శ్వాగ్'. రీతూవర్మ కథానాయిక. మీరాజాస్మిన్ ఓ ప్రత్యేకపాత్ర పోషిస్తున్నది. హసిత్ గోలి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. ఇప్పటికే మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. అందులో భాగంగానే ఈ ఆదివారం ఇందులో మహారాణి ఉత్పల దేవిగా నటిస్తున్న మీరాజాస్మిన్‌ని పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్ లుక్‌ని రివీల్ చేశారు. ఈ లుక్‌లో మీరా మహారాణిగా మెరిసిపోతున్నది. కొంత విరామం తర్వాత మీరాజాస్మిన్ చేస్తున్న తెలుగు సినిమా ఇదే కావడం గమనార్హం. వింజామర వంశానికి చెందిన రాణీ రుక్మిణీదేవిగా ఇందులో రీతూవర్మ కనిపించనుంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కెమెరా: వేద రామన్ శంకర్, సంగీతం: వివేక్ సాగర్.

## కమల్‌హాసన్ నటవిశ్వరూపం భారతీయుడు 2

"ఇండియన్ 2' కమల్ అభిమానులకే కాదు, సగటు సినీ అభిమానులందరికీ విందుభోజనం లాంటి సినిమా. ఇందులోని ప్రతి సన్నివేశంలో కమల్ అత్యంత శక్తిమంతంగా కనిపిస్తారు. జూలై 12న ప్రేక్షకులు ఆయన నట విశ్వరూపాన్ని చూస్తారు.' అని దర్శకుడు శంకర్ అన్నారు. 'ఇండియన్' ఫ్రాంచైజీలో భాగంగా ఆయన దర్శకత్వంలో వస్తున్న 'ఇండియన్ 2' సినిమా ఆడియో వేడుక చెన్నయ్ నెహ్రూ స్టేడియంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ 'ఎన్నో అవరోధాలను అధిగమించి విడుదలకు సిద్ధమయ్యింది 'ఇండియన్ 2'. అన్ని విషయాల్లో మాకు వెన్నంటి ఉండి ముందుకు నడిపించిన నిర్మాత ఉదయనిధి స్టాలిన్ సహకారం మరిచిపోలేనిది. అందరు మెచ్చేలా 'ఇండియన్ 2' ఉంటుంది.' అని నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సినిమాను థియేటర్‌లో చూడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని దర్శకుడు లోకేష్ కనకరాజ్ అన్నారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్ కూడా ఈ వేడుకలో సందడి చేశారు. బ్రహ్మానందం, శింబు, అనిరుథ్, మౌనీరాయ్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సినిమా 'భారతీయుడు 2'గా తెలుగులో విడుదల కానున్న విషయం తెలిసిందే.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com